నిపుణ
నమస్తే తెలంగాణ
Telangana Today

# ఒకే రకం భౌతిక లక్షణాలు.. సామాజిక సమూహాలు




- సమాజం అంటే ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ప్రకారం సామాజిక ప్రవర్తనల, అభివృద్ధిని శాస్త్రీయంగా అధ్యయనం చేసేదే సమాజ శాస్త్రం.
- ప్రపంచ సమాజశాస్త్ర పితామహుడు – ఆగస్ట్ కామ్టే
- భారతదేశంలో సమాజశాస్త్ర పితామహుడు – గోవింద సదాశివ ఘుర్యే
- సమాజం అనేది సామాజిక సంబంధాల అల్లిక అని చెప్పింది – మెకైవర్

**రాబర్ట్ రెడ్ ఫీల్డ్ ప్రకారం**

సమాజాలు రెండు రకాలు
1. జానపద సమాజాలు
2. పట్టణ సమాజాలు

- ఆగస్ట్ కామ్టే భౌతిక శాస్త్రం లాగే, శాస్త్రీయ పద్ధతులు ఉపయోగించి సమాజంలోని మానవుని చర్యలు అధ్యయనం చేయడం సమాజ శాస్త్రం అని చెప్పారు.

**సమాజం లక్షణాలు**

1) ఒకే భౌగోళిక సరిహద్దు, ఉమ్మడి సంస్కృతి, ఒకే విధమైన, విశిష్టమైన ఉనికిని కలిగి ఉంటుంది.
2) అంతఃసమూహం (ఉదా: ఒకే గ్రామంలో ఉండేవారు)
3) స్వతంత్రమైనది
4) శాశ్వతమైనది
5) ఐక్యంగా ఉంటారు
6) లైంగిక నియంత్రణ, సాంఘిక నియంత్రణ కలిగి ఉంటుంది.
7) శ్రమవిభజన అనే విశిష్టమైన లక్షణం కలిగి ఉంటుంది.

**జజ్‌మాని వ్యవస్థ**

- ఇది యజమాని అనే సంస్కృత పదం నుంచి వచ్చింది. దీనిపై విలియం వైజర్ ది ఇండియన్ జజ్‌మాని సిస్టమ్ అనే పుస్తకం రాశారు.
- వృత్తిపరమైన సేవల పరస్పర వినిమయాన్ని జజ్‌మాని వ్యవస్థ అంటారు.
- ఒక సమాజంలో వ్యక్తుల మధ్య ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించడానికి ఆ సమాజంలోని వ్యక్తులు ఒకరికొకరు వృత్తిపరమైన సేవలను అందజేస్తుంటారు.
- ఈ విధానంలో సేవలను అందించే వ్యక్తిని 'కామిన్' అంటారు.
- ఈ వ్యవస్థ భారతదేశంలో గ్రామీణ సమాజంలో ఉండేది.

**సామాజిక నిర్మితి**

- సమాజంలో సామాజిక సంస్థలు సముదాయాలు, సమూహాలు, వ్యక్తులు ఉంటారు. వ్యక్తులు విభిన్న ప్రమాణాలు పాటిస్తూ, విభిన్న పాత్రలు నిర్వహిస్తూ, విభిన్న సామాజిక అంతస్తులను కలిగి విభిన్న సామాజిక సంబంధాలను ఏర్పరుచుకుంటారు. దీన్నే సామాజిక నిర్మితి అని చెప్పవచ్చు.
- సమాజంలోని సమూహాలు రెండు రకాలుగా ఉంటాయి.
  1) ప్రత్యక్ష సమూహాలు
  2) పరోక్ష సమూహాలు

**ఉదా:** కుల సమూహాలు, మత సమూహాలు, గిరిజన సమూహాలు

- సమాజం – సముదాయం: కొన్ని సమూహాలు కలిసి సముదాయం ఏర్పడుతుంది.

**ఉదా:** గ్రామీణ సముదాయం, పట్టణ సముదాయం, గిరిజన సముదాయం

**సంస్థలు**

**ఉదా:** 1) విద్యా సంస్థ
2) రాజకీయ సంస్థ
3) ఆర్థిక సంస్థ

- సమాజంలోని సంస్థలు కొన్ని శాశ్వతంగా ఉంటాయి. కొన్ని తాత్కాలికంగా ఉంటాయి.

**శాశ్వత సామాజిక సంస్థలు :** ఇవి ఉమ్మడి లక్ష్యం, కొన్ని ప్రత్యేక నియమాలు కలిగి ఉంటాయి.

- ఇవి ఒక తరం నుంచి మరొక తరానికి దీర్ఘకాలికంగా కొనసాగుతాయి.
- ఇవి వ్యక్తి అంతర్గత, బహిర్గత ప్రవర్తనను నియంత్రిస్తూ ఉంటాయి.
- కింది వాటిని సామాజిక సంస్థలు అంటారు.
- కుల సంస్థ, మత సంస్థ, బంధుత్వం, వివాహం, కుటుంబం, రాజకీయ వ్యవస్థ, విద్యా వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ.
- మెగస్తనీస్ అనే విదేశీ రాయబారి భారతీయ సమాజంలో ఏడు వర్గాలు ఉన్నాయని తెలియజేశాడు. అవి
  1) తత్వవేత్తలు
  2) గృహ యజమానులు
  3) పశుపాలకులు, వేటగాళ్లు
  4) వ్యాపారస్థులు, శారీరక శ్రమ చేసేవారు
  5) యుద్ధం చేసేవాళ్లు
  6) తనిఖీదారులు
  7) మంత్రులు, సలహాదారులు, కన్వీనర్లు
- ఆనాటి సమాజంలో వృత్తులు మార్చుకోవడానికి వీలులేదు. అంటే సామాజిక గమనశీలత లేదు.

**భిన్నత్వంలో ఏకత్వం :** భారతదేశ సమాజంలో విభిన్న భాషలు, మతాలు, జాతులు, సంస్కృతులు, భౌగోళిక పరిస్థితులు ఉన్నాయి. దీన్నే భిన్నత్వంలో ఏకత్వం అంటారు.

- 1962 జనాభా లెక్కల ప్రకారం 1652 భాషలున్నాయి.
- వీటిలో 23 భాషలు మాత్రమే 97 శాతం ప్రజలు మాట్లాడుతున్నారు.
- రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో భాషలను పొందుపరచడం జరిగింది. ప్రస్తుతం 22 అధికార భాషలున్నాయి.

**ప్రాచీన భాష హోదా**

తమిళనాడు –2004
కన్నడ, తెలుగు –2008
మలయాళం –2013
ఒరియా – 2014

**దేశంలో ఉన్న 4 ప్రధాన భాషా కుటుంబాలు**

1) **ఇండో ఆర్యన్ భాషా కుటుంబం :** 70 శాతం ప్రజలు ఈ భాషను మాట్లాడతారు.
**ఉదా:** హిందీ
2) **ద్రవిడ భాషా కుటుంబం :** 25 శాతం ప్రజలు ఈ భాషను మాట్లాడతారు.
**ఉదా:** తెలుగు, తమిళం, సంస్కృతం
3) **ఇండో యూరోపియన్ భాషా కుటుంబం :** 1.3 శాతం ప్రజలు మాట్లాడతారు.
4) సినోటిబెటన్

- భారతదేశ సమాజాన్ని 12 భాషా ప్రాంతాలుగా గుర్తించారు. భాషా శాస్త్రవేత్త గ్రియర్‌సన్ ప్రకారం 179 భాషలు, 54 మాండలిక భాషలు మనదేశంలో ఉన్నాయి.
- 2022 నుంచి 2032 వరకు స్థానిక తెగల, భాషల దశాబ్దంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.

| మతం | జనాభా శాతం | జనాభా |
|---|---|---|
| హిందువులు | 79.8 శాతం | 9663 కోట్లు |
| ముస్లింలు | 14.2 శాతం | 17.22 కోట్లు |
| క్రైస్తవులు | 2.3 శాతం | 2.78 కోట్లు |
| సిక్కులు | 1.7 శాతం | 2.08 కోట్లు |
| బౌద్ధులు | 0.7 శాతం | 0.84 కోట్లు |
| జైనులు | 0.45 శాతం | 45 లక్షలు |

**భారతీయ సమాజం కుటుంబ వ్యవస్థ**

- నంబూద్రి తెగలు కుటుంబాన్ని ఇల్లం అని పిలుస్తారు. ఉమ్మడి కుటుంబంలో ఇంటి పెద్దను కర్త అంటారు.
- నంబూద్రిలో ఇంటి పెద్దను కర్ణవన్ అని పిలుస్తారు.

**మితాక్షర సంప్రదాయం:** వీటి ప్రకారం పుట్టుకతోనే ఆస్తికి వారసుడు అవుతాడు. తల్లిదండ్రులు జీవించి ఉండగానే పిల్లలు వారి ఆస్తులు పొందడం అనే సంప్రదాయం భారతదేశం అంతటా ఉన్నది. కానీ స్త్రీలకు ఆస్తి హక్కులేదు. దీనినే మితాక్షర సంప్రదాయం అంటారు.

- కానీ అస్సాం, బెంగాల్‌లో ఈ సంప్రదాయం లేదు.

**దయాభాగ సంప్రదాయం :** తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత మాత్రమే తల్లిదండ్రుల ఆస్తి వారసులకు వస్తుంది. ఈ సంప్రదాయం భారతదేశంలో కేవలం అస్సాం, బెంగాల్‌లో మాత్రమే ఉంది.

**సర్వాత్మవాదం** (Animatisam): దీన్ని ఇ.బి. టేలర్ ప్రతిపాదించారు. ఈ వాదం ప్రకారం ఆత్మనే శక్తి అని నమ్ముతారు. మనిషికి రెండు ఆత్మలుంటాయి. అవి
1) స్వేచ్ఛగా తిరిగే ఆత్మ
2) శరీరంలో ఉండే ఆత్మ

**భిన్నత్వంలో ఏకత్వం**

- వైవిధ్యం అంటే వివిధ జాతులు, మతాలు, భాషలు, కులాలు, సంస్కృతులు. యూనిటీ అనే పదానికి ఏకీకరణ అని అర్థం. భిన్నత్వంలో ఏకత్వం అంటే ప్రాథమికంగా ఏకత్వం లేని ఏకత్వం, విచ్ఛిన్నం లేని వైవిధ్యం అని అర్థం. వైవిధ్యం మానవ పరస్పర చర్యను సుసంపన్నం చేస్తుందనే భావనపై ఇది ఆధారపడి ఉంటుంది. భారతదేశం గొప్ప సాంస్కృతిక వైవిధ్యం కలిగిన దేశం అని చెప్పినపుడు ఇక్కడ అనేక రకాల సామాజిక సమూహాలు, సంఘాలు నివసిస్తున్నాయని అర్థం. అవి భాష, మతం, జాతి, కులం, విభాగం వంటి సాంస్కృతిక గుర్తుల ద్వారా నిర్వహించే సంఘాలు.

**కుల భిన్నత్వం**

- ఇండియాలో భిన్నత్వం ఉన్నప్పటికీ ఏకత్వంతో ఉన్నారు.
- కుల భిన్నత్వం, మత విభిన్నతలో ఏకత్వానికి ఉదాహరణ పుణ్యక్షేత్రాలు వేములవాడ, కొమురవెల్లి, రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గా, జాన్ పహాడ్ దర్గా (సూర్యాపేట), జహంగీర్ పేట్ (హైదరాబాద్) అదే విధంగా పీర్ల పండుగను హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకొంటారు.
- రాజ్యాంగం ప్రకారం భిన్నత్వంలో ఏకత్వానికి ఉదాహరణ: ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక విధులు, ఉమ్మడి పౌరస్మృతి అనేవి దేశమంతటా ప్రజలందరికీ ఒకే విధంగా అమలు చేస్తున్నారు.

**జాతుల భిన్నత్వం**

- జాతి అంటే ఒకే రకమైన భౌతిక లక్షణాలు, శరీరం రంగు, నాసిక నిర్మాణం, కేశాల రూపు మొదలైన లక్షణాలు గల వ్యక్తుల సమూహాన్ని జాతి అంటారు.
- భారతదేశ సమాజం వివిధ జాతుల ప్రదర్శన శాల – వి.ఎ. స్మిత్
- జనాభా లెక్కలు 1931 హట్టన్, బి.ఎస్.గుహ జాతులపై అధ్యయనం చేశారు.
- డి.ఎన్. మజుందార్, హట్టన్, బి.ఎస్.గుహ ప్రకారం జాతుల వర్గీకరణ ప్రాంతాలవారీగా కింది విధంగా ఉంది.
  1) ఉత్తర , ఈశాన్య మండలి
  2) కేంద్ర, మధ్య మండలి
  3) దక్షిణ మండలి
- బి.ఎస్.గుహ ప్రకారం భారతదేశంలో ఆరు రకాల జాతులున్నాయి. అవి
  1) నీగ్రిటోస్
- భౌగోళిక శాస్త్రవేత్తల ప్రకారం వీరు భారతదేశంలోని తొలి ఆక్రమణదారులు
- అలాగే నీగ్రోయిడ్ ప్రజలు ఆఫ్రికా నుంచి భారతదేశానికి వలస వచ్చి భారతదేశ గడ్డపై తమ భాషను స్థాపించారని వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ లక్షణాలు ముఖ్యంగా అండమాన్ ద్వీపవాసులు, నీలగిరి కొండల్లోని ఉదాలిస్, కొచ్చిలోని కడోర్స్, పళని కొండల పుల్లయన్లు మొదలైన వారిలో కనిపిస్తాయి.
- ఈశాన్య ప్రాంతంలోని అంగామి నాగాలు, జార్ఖండ్‌లోని రాజ్‌మహల్ హిల్స్‌లోని బాగ్దీలు వంటి గిరిజనులు ఈ లక్షణాలను కలిగి ఉన్నారు.
- పొట్టి, ముదురు గోధుమ వర్ణ చర్మం, ఉన్ని జుట్టు, ఉబ్బిన నుదురు, విశాలమైన చదునైన ముక్కు, కొద్దిగా పొడుచుకు వచ్చిన దవడలతో ముఖం ఉంటుంది.

2) **ప్రోటో ఆస్ట్రాలాయిడ్స్**

- వీరు నీగ్రిటోస్ తర్వాత తూర్పు మధ్యధరా ప్రాంతం (పాలస్తీనా) నుంచి భారతదేశానికి వచ్చారని నమ్ముతారు. ప్రస్తుతం వారు మధ్య దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో జనాభాలో ఎక్కువ మంది ఉన్నారు.
- వెడ్డలు, ఇరులు, షోలగాలు వారి నిజమైన ప్రతినిధులు. మధ్య భారతదేశంలోని ఎత్తయిన ప్రాంతాల్లోని భిల్లులు, కొలిలు, బడగలు, కోర్వాలు, ముండాలు, భుమ్జీలు, దక్షిణ భారత దేశంలోని చెంచులు, కురుంబలు, మలయన్లు, యెరువాలు వీరందరిని కూడా వారి ప్రతినిధులుగా పరిగణించవచ్చు.
- కొంతమంది ఆంత్రోపాలజిస్టుల ప్రకారం ఈ వ్యక్తులు వారి రాకతో నీగ్రిటోలను నెట్టివేసి స్థానభ్రంశం చేసి మరింత చేరుకోలేని మారుమూల తక్కువ ఆతిథ్యం ఇచ్చే ప్రాంతాలకు మార్చారు. అక్కడ వారు ఈ నాటికీ కనిపిస్తారు.
- భౌతిక రూపంలో, వారు ఉన్ని జట్టును మినహాయించి నీగ్రిటోలను పోలి ఉంటారు.
- వారి ఇతర భౌతిక లక్షణాలు: ఉబ్బెత్తుగా ఉన్న నుదురు, విశాలమైన చదునైన ముక్కు, కొద్దిగా పొడుచుకు వచ్చిన దవడలు కలిగి ఉంటారు.

3) **మంగోలాయిడ్**

- మంగోలాయిడ్ జాతికి చైనా మాతృభూమి అని నమ్ముతారు. ఇక్కడి నుంచి వారు మలయా ద్వీపకల్పం, ఇండోనేషియాలోని దక్షిణం వైపునకు నెట్టబడ్డారు.
- వారు ఉత్తర, తూర్పు పర్వతాల్లోని కనుముల ద్వారా భారతదేశంలోకి ప్రవేశించారు.
- ప్రస్తుతం వారు లడఖ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, తూర్పు భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో పెద్ద ప్రాంతాలను ఆక్రమించారు.
- వారి శారీరక లక్షణాలు గుండ్రంగా, వెడల్పుగా ఉండే తల, చాలా ఎత్తుగా ఉన్న చెంప, దవడ ఎముకలు, పొడవాటి చదునైన ముక్కు, ముఖం, శరీరంపై కొద్దిగా లేదా జుట్టు లేకుండా ఉంటారు.
- గారో, ఖాసీ, జైంతియా, లెప్చాస్, చక్మాస్, నాగా తెగలు ఈ జాతికి చెందినవి.
- వీటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి

ఎ) **పాలియో- మంగోలాయిడ్లు:** వీరు భారతదేశానికి వచ్చిన మంగోలాయిడ్లలో మొదటివారు. ఈ ప్రజలు ప్రధానంగా హిమాలయాల సరిహద్దు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరు ఎక్కువగా అస్సాం, దాని పక్క రాష్ట్రాల్లో కనిపిస్తారు.

బి) **టిబెటో-మంగోలాయిడ్లు:** ఈ ప్రజలు టిబెట్ నుంచి వచ్చారు. ప్రధానంగా భూటాన్, సిక్కిం, వాయవ్య హిమాలయాల ప్రాంతాలు, లడఖ్, బాల్చిస్థాన్‌లో చేర్చిన హిమాలయాలకు వచ్చి స్థిరపడ్డారు.

4) **మెడిటేరియన్లు**

- ఈ జాతి తూర్పు మధ్యధరా ప్రాంతం లేదా నైరుతి ఆసియా నుంచి భారతదేశానికి వచ్చింది. వారి శారీరక లక్షణాలు మధ్యస్థ పొట్టి తనాన్ని, ముదురు రంగు చర్మం, పొడవాటి తల కలిగి ఉంటారు.
- మొదట ఉత్తర-పశ్చిమ భారతదేశంలో స్థిరపడ్డారు. అక్కడ వ్యవసాయం చేయడం ప్రారంభించారు. తదుపరి వలసదారుల ద్వారా వారు మధ్య, దక్షిణ భారతదేశంలోకి నెట్టబడ్డారు.
- ప్రస్తుతం వారు దక్షిణ భారతదేశంలోని జనాభాలో ఎక్కువ భాగం, ఉత్తర భారతదేశంలో గణనీయమైన నిష్పత్తిలో ఉన్నారు.

బి.పురుషోత్తం రెడ్డి
ఫ్యాకల్టీ, ఏమర్స్ విల్
9030925817





## ఐసీఎంఆర్‌లో..

**ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 5
- పోస్టులు: యూడీసీ, ఎల్‌డీసీ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఏప్రిల్ 18
- వెబ్‌సైట్: https://www.nioh.org

## టీఐఎఫ్ఆర్‌లో పీహెచ్‌డీ

**హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్)లో కింది ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**

- ప్రోగ్రామ్స్: పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ –పీహెచ్‌డీ (ఆగస్టు 2024)
- సబ్జెక్టులు: ఫిజిక్స్, కెమిస్ట్రీ
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఏప్రిల్ 30
- వెబ్‌సైట్: https://gsadmissions.tifrh.res.in

## ఎన్ఐఆర్‌టీలో...

**ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ట్యూబర్క్యులోసిస్ (ఎన్ఐఆర్‌టీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 25
- పోస్టులు: ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ కన్సల్టెంట్, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఏప్రిల్ 10
- వెబ్‌సైట్: https://nirt.res.in

## ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- డీఎస్సీ... పీఈటీ,గ్రూప్స్..తెలంగాణ చరిత్ర కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# గురుకులాలు.. ఉపాధికి మార్గాలు

- అందుబాటులో వృత్తివిద్యా కోర్సులు
- ఉద్యోగ, ఉన్నత విద్యావకాశాలు
- దరఖాస్తులకు 12 చివరితేదీ

**నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు స్వల్ప కాలంలోనే ఉపాధి అవకాశాలను కల్పించడంలో గురుకులాలు కీలకభూమికను పోషిస్తున్నాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా, విభిన్న, విద్యార్థుల సృజనాత్మకతకు పదునుపెట్టే వృత్తివిద్యా కోర్సులను అందిస్తున్నాయి. అందుకు మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాలే నిదర్శనం. గురుకులాల్లో ఇంటర్‌లో రెగ్యులర్ కోర్సులతో పాటు ఒకేషనల్ కోర్సులకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతున్నది. ఆ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు కాలేజీ నుంచే సరాసరి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాల్లో చేరుతుండటం విశేషం. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఆయా కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 12 చివరితేదీ. ఈ నేపథ్యంలో బీసీ గురుకులాల్లోని వృత్తి విద్యా కోర్సులపై 'నిపుణ' ప్రత్యేక కథనం..**

**ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్**

- ప్రీ-స్కూల్ టీచర్ ట్రైనింగ్ గ్రాడ్యుయేట్లు ప్రైవేట్ పాఠశాలలు, డే కేర్ సెంటర్లు, ఇతర బాల్య విద్యా కార్యక్రమాల్లో ఉపాధి పొందవచ్చు. ఈ కోర్సులు అత్యంత లాభదాయకంగా ఉన్నాయి. ప్రైవేట్ విద్యారంగంలో టీచర్ ఉద్యోగాలకు పోటీ ఎక్కువగా ఉంటుంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వరంగంలో, ప్రీ-స్కూల్ టీచర్ ట్రైనింగ్ గ్రాడ్యుయేట్లుగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రీ ప్రైమరీ, క్రెచ్, ప్రభుత్వం నిర్వహించే ఇతర విద్యా కార్యక్రమాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కేవలం ఉపాధి మార్గంగానే కాకుండా టీచింగ్ రంగంలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి ప్రీ-స్కూల్ టీచర్ కోర్సు ఉపయోగపడుతుంది. ఈ కోర్సు అధునాతన కెరీర్ అవకాశాలను కొనసాగించే అవకాశం కూడా ఉన్నది. దేశంలోని అనేక విశ్వవిద్యాలయాలు బాల్య విద్య, బ్రిడ్జ్ కోర్సుతో కూడిన కమ్యూనిటీ సైన్స్, చైల్డ్ సైకాలజీ, సంబంధిత రంగాల్లో అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి. మాంటిస్సోరి ఎడ్యుకేషన్, వాల్డోర్ఫ్ ఎడ్యుకేషన్, రెగ్గియో ఎమిలియా ఎడ్యుకేషన్ వంటి ప్రత్యేక రంగాల్లో అనేక సర్టిఫికేషన్, డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. టీచర్ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవాలనుకునేవారికి ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్‌ను మించిన కోర్సు లేదు.

**కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ (సీజీఏ)**

- కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ రంగం అత్యంత ఆశాజనకమైన, డైనమిక్ పరిశ్రమ. ఇది ఇటీవల మన దేశంలో అద్భుతమైన వృద్ధిని సాధిస్తున్నది. సీజీఏ కోర్సు అనేక రకాల ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది. ఈ రంగంలో నిపుణుల కోసం రోజురోజుకూ డిమాండ్ పెరుగుతున్నది. ఇది డిజిటల్ ఆర్ట్స్‌లో కెరీర్‌పై ఆసక్తి ఉన్న వారికి ఈ కోర్సు అత్యుత్తమమైనది. సీజీఏ పూర్తి చేస్తే యూఐ, యూఎక్స్ డిజైనర్లుగా, యానిమేటర్లు, గ్రాఫిక్, వెహికల్, ప్రొడక్ట్, ఇంటీరియర్ డిజైనర్లు, ఆర్ట్ డైరెక్టర్లుగా ఉద్యోగాలు పొందవచ్చు. అడ్వర్టయిజ్‌మెంట్, చలనచిత్రం, టెలివిజన్, వీడియో గేమ్ డెవలప్‌మెంట్, వెబ్‌సైట్ డిజైన్‌తో సహా అనేక రకాల పరిశ్రమల్లో నిపుణులకు ఎక్కువగా అవకాశాలున్నాయి. అదేవిధంగా సీజీఏ తర్వాత బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ), ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) సంస్థలు, అనేక విశ్వవిద్యాలయాల్లో డిజైన్, యానిమేషన్, విజువల్ మీడియా, ప్రొడక్ట్ డిజైన్, ఇండస్ట్రియల్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, ఇలస్ట్రేషన్, ప్రోగ్రామ్ 3డీ మోడలింగ్, గేమ్ డిజైన్, వర్చువల్ రియాలిటీ తదితర వాటితోపాటు ప్రత్యేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

**అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్ (ఏసీపీ)**

- వ్యవసాయ రంగంపై యువతలో పెరుగుతున్న ఆసక్తి మేరకు ఈ కోర్సును రూపొందించారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి బీఎస్సీ అగ్రికల్చర్ చేసేందుకు అవకాశం ఉంటుంది. అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో అనేక ఉద్యోగాల్లో చేరేందుకు అర్హత సాధిస్తారు.

**కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ (సీజీటీ)**

- కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ కోర్సు పూర్తి చేసిన తర్వాత అనేక ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. సొంతంగా బొటిక్ ఏర్పాటు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్‌గా టైలరింగ్ యూనిట్స్ ప్రారంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఫ్యాషన్ డిజైనింగ్ కెరీర్‌పై ఆసక్తి ఉన్నవారు ఉన్నత విద్యాకోర్సుల్లో బీఎఫ్‌టీ (ఫ్యాషన్ టెక్నాలజీ ), బీఈడీ (బ్యాచిలర్ ఆఫ్ డిజైనింగ్), కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో చేరవచ్చు. కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ పూర్తి చేసిన తర్వాత ప్రైవేట్, గవర్నమెంట్ సెక్టార్‌లో కూడా పుష్కలమైన ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.



**వైద్యరంగంలో ఒకేషనల్ కోర్సులు**

- స్వల్పకాలంలోనే ఉపాధి అవకాశాలను పొందడానికి ఇది చక్కటి కోర్సు. ప్రభుత్వం రంగం కంటే కార్పొరేట్ రంగంలో విపరీతమైన డిమాండ్ ఉంది. వైద్యరంగంలో ఉపాధి పొందే మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తయిన తర్వాత ఉన్నత విద్యా కోర్సుల్లో చేరవచ్చు. మెడికల్ స్ట్రీమ్ కోర్సుల్లో ప్రవేశం సులభమవుతుంది. బీడీఎస్ వెటర్నరీ, ఫార్మసీ కోర్సు, బీఎస్సీ నర్సింగ్ కూడా చేయవచ్చు. దాంతో పాటు బీఎస్సీ కోర్సెస్ జనరల్ కోర్సెస్ కూడా చేసే అవకాశం ఉన్నది. అదేవిధంగా మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు కూడా గురుకులంలో అందుబాటులో ఉన్నది. కోర్సు పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్యా కోర్సు బీఎస్సీ (నర్సింగ్), జనరల్ నర్సింగ్ కోర్సుల్లో చేరవచ్చు. ప్రైవేట్, గవర్నమెంట్ సెక్టార్‌లో ఏఎన్ఎంగా చేరవచ్చు. వాటితో పాటు ఫిజియోథెరపీ (పీటీ), టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ తదితర కోర్సులు ఉపాధి, ఉన్నత విద్యా అవకాశాలను అందించేందుకు వీలుగా రూపొందించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో అత్యధిక డిమాండ్ ఉన్న ఈ కోర్సులను బీసీ జూనియర్ గురుకుల కాలేజీల్లో అందిస్తున్నారు.

**ప్రవేశాలకు అర్హతలు, ఎంపిక**

- తెలంగాణ ప్రాంతానికి చెందిన విద్యార్థులై ఉండాలి.
- 2023-24లో పదోతరగతి పూర్తిచేసినవారు. ఈ ఏడాది పరీక్షలు రాస్తున్నవారు మాత్రమే అర్హులు.
- పట్టణప్రాంత విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మించకూడదు.
- అర్హులైన విద్యార్థులు 12వ తేదీలోగా https://mjptbcwreis.telangana.gov.in
- వెబ్‌సైట్ ద్వారా రూ.200 ఫీజు చెల్లించి దరఖాస్తులను సమర్పించాలి.
- ఈ నెల 28న నిర్వహించే రాత పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.
- పూర్తి వివరాలకు 040- 23328266 నంబర్‌లో సంప్రదించవచ్చు.

**ఇంటర్‌లో అందిస్తున్న వృత్తి విద్యాకోర్సులు**

- ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ (పీఎస్‌టీటీ)
- కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ (సీజీఏ)
- అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్ (ఏసీపీ)
- కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ (సీజీటీ)
- మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ (ఎంపీహెచ్ డబ్ల్యూ)
- మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ)
- ఫిజియోథెరపీ (పీటీ)
- టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (టీహెచ్)

– మ్యాకం రవికుమార్

# సింధూ ప్రజలు పవిత్రంగా ఆరాధించిన చెట్టు?

1. మౌర్య రాజ్య స్థాపకుడు ఎవరు?
   1) చంద్రగుప్తుడు 2) అశోకుడు
   3) బింబిసారుడు 4) బిందుసారుడు
2. ఉస్మాన్‌సాగర్‌ను 1920లో ఏ నదిపై నిర్మించారు?
   1) మూసీ 2) ఎర్రవాగు
   3) మంజీరా 4) పెద్దవాగు
3. నవరత్నాలు అనే కవి పండితులు ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
   1) చంద్రగుప్త విక్రమాదిత్యుడు
   2) శ్రీగుప్తుడు
   3) సముద్రగుప్తుడు
   4) కుమారగుప్తుడు
4. రుద్రమదేవి తండ్రి ఎవరు?
   1) గణపతి దేవుడు
   2) ప్రతాపరుద్రుడు
   3) మహదేవుడు
   4) రుద్రదేవుడు
5. ఛత్రపతి శివాజీ గురువు?
   1) సమర్థ రామదాసు
   2) ఏక్‌నాథ్
   3) తుకారాం
   4) వామన్ పండిట్
6. అలీసాగర్ రిజర్వాయర్‌ను నిర్మించినవారు?
   1) మీర్ మహబూబ్ అలీఖాన్
   2) నిజాం ఉల్ ముల్క్
   3) మీర్ ఉస్మాన్ అలీఖాన్
   4) సాలార్‌జంగ్
7. ఎల్లోరా గుహాలయాలు ప్రధానంగా ఎవరి కాలానికి చెందినవి?
   1) మౌర్యులు 2) శుంగులు
   3) గుప్తులు 4) చౌహాన్‌లు
8. 1922లో సింధూ నాగరికత తవ్వకాలు జరిపినవారు?
   1) సర్ జాన్ మార్షల్
   2) వీఏ స్మిత్
   3) డి.డి. కోశాంబి
   4) మార్టిమర్ వీలర్
9. సింధూలోయ నాగరికతకు సంబంధించి బయల్పడిన మొదటి నగరం?
   1) హరప్పా
   2) మొహెంజోదారో
   3) లోథాల్
   4) చన్హుదారో
10. సింధూ ప్రజల ప్రధాన రేవు పట్టణం ఏది?
    1) హరప్పా 2) మొహెంజోదారో
    3) లోథాల్ 4) చన్హుదారో
11. కింది వాటిలో సింధూ నాగరికత లక్షణం కానిది?
    1) బొమ్మల లిపి
    2) పట్టణ నివాసం
    3) క్రమరహిత రహదారులు
    4) విదేశీ వర్తకం
12. 11.8X7 మీ కొలతలతో నిర్మించిన స్నాన ఘట్టం ఏ నగరంలో కనుగొన్నారు?
    1) హరప్పా 2) మొహెంజోదారో
    3) దైమాబాద్ 4) అలంగీర్
13. సింధూ ప్రజలు పవిత్రంగా ఆరాధించిన చెట్టు?
    1) రావి చెట్టు 2) వేపచెట్టు
    3) మర్రిచెట్టు 4) పాల వృక్షం
14. కింది వాటిలో సింధూ నాగరికతకు సంబంధించి అసత్య వాక్యం?
    1) వీరు దేవాలయాలను నిర్మించారు
    2) పశుపతిని ఆరాధించారు
    3) జంతువులు, చెట్లను పూజించారు
    4) అమ్మతల్లి విగ్రహాలు లభించాయి
15. వేదాల్లో ప్రాచీనమైనది?
    1) రుగ్వేదం 2) సామ వేదం
    3) అథర్వణ వేదం 4) యజుర్వేదం
16. ఆర్యుల్లో వ్యవసాయం చేస్తూ పశుపోషణ చేయటం ఎవరి విధి?
    1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు
    3) వైశ్యులు 4) శూద్రులు
17. ఆర్యులు యజుర్వేదం, అథర్వణ వేదం ఎక్కడ సంకలనం చేశారు?
    1) బ్రహ్మపుత్ర మైదానం
    2) గోదావరి తీరం
    3) గంగా యమునా తీరం
    4) సింధూనది పరీవాహక ప్రాంతం

**సమాధానాలు**

| | | | |
|---|---|---|---|
| 1. 1 | 2. 1 | 3. 1 | 4. 1 |
| 5. 1 | 6. 3 | 7. 3 | 8. 1 |
| 9. 1 | 10. 3 | 11. 3 | 12. 2 |
| 13. 1 | 14. 1 | 15. 1 | 16. 3 |
| 17. 3 | | | |

ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్స్ సౌజన్యంతో..